

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 4 సంచిక : 39 పుష్పం : 49-50 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 6-9-99 భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

నేను నామాన్ని చేసుకొంటున్నాను, జపం చేసుకొంటున్నాను అని ఒక భక్తుడు భగవాన్ తో చెప్తున్నాడు. దానిని భగవాన్ ఖండించటం లేదు. అలాగే చేసుకో. నీ ప్రస్తుత అభ్యాసాన్ని కొనసాగించవచ్చు. నీవు చేసేది ఇష్టంతో చేసుకో, ప్రేమతో చేసుకో, భక్తితో చేసుకో. అది కొనసాగించు. అది మధ్యలో ఆపనక్కరలేదు. అదికూడా నిన్ను చివరిస్థితికి, సత్యస్థితికి తీసుకొని పోతుంది. నీవు వెళ్ళేమార్గాన్ని మార్చనక్కరలేదు. నీవుచేసేది శ్రద్ధగాచేసుకో అని భగవాన్ అతనికి ప్రోత్సాహం ఇస్తున్నారు. నీ మనస్సును నామానికి కట్టేస్తే చిల్లరచింతలు తగ్గిపోతాయి. నీ మనస్సు చల్లబడుతుంది. ముఖ్యంగా మనం చేసేనామం మీద మనకు గౌరవం ఉండాలి, అభిమానం ఉండాలి, మనం ఎవరితోనైనా మాట్లాడేటప్పుడు కఠినంగా చెప్పకూడదు. మృదువుగా చెప్పాలి. వినేవాడు అభివృద్ధిలోనికి రావాలి అనే కాంక్షతో చెప్పాలి, మీరు ఎవరితోనైనా మాట్లాడుతున్నారు అనుకోండి. ఆ మాటలు అయిన వెంటనే మీ మనస్సు నామం మీదకు వెళ్ళిపోవాలి. వ్యర్థమైనచింతలు, వ్యర్థమైనకర్మలు, వ్యర్థమైనకోరికలు తగ్గించుకోమని భగవంతుడు గీతలో చెప్పాడు. మనకు అనవసరమైన ఆలోచనలు ఎక్కువగా వస్తూఉంటాయి. వాటి ఉపయోగం ఏమీఉండదు. కొంతమంది అనవసరమైన మాటలు ఎక్కువగా మాట్లాడుతూ ఉంటారు. ఆ మాటలు వారికి ఉపయోగపడవు, ఇతరులకు ఉపయోగపడవు. మనకు మంచి తలంపు వస్తే మంచిమాట మాట్లాడతాము. మంచి పనులుచేస్తాము. తలంపునుబట్టి మాట, చేత ఉంటుంది. అందువలన తలంపుల విషయంలో మనం బహుజాగ్రత్తగా ఉండాలి. ఈ దేహం అమాయకురాలు, ఎలాచెపితే అలా వింటుంది. మనస్సు ప్రధానం. అశాంతి శరీరానికి రాదు, మనస్సుకు వస్తుంది. మనస్సుకు అశాంతి వస్తే దాని ప్రభావం శరీరం మీద ఉంటుంది. అందువలన మనస్సును ఆరోగ్యంగా ఉంచుకోవాలి. మాటమాటకు మనస్సును ఉద్రేకపరచకూడదు.

భగవంతుని గురించి చెపుతూ సత్యం, శివం, సుందరం అని చెపుతారు. ఇవి మూడూ మనకు వేరుగా కనిపిస్తున్నాయి గాని మూడూ ఒక్కటే. సత్యమే శివం, సత్యమే సుందరం, నిజమైనసౌందర్యం నీ హృదయంలోనే ఉంది. అదినీకు అందాలంటే దానిమీద నీకు గౌరవం ఉండాలి. దానిని తెలుసుకోవాలనే కాంక్ష ఉండాలి. దానిగురించి మాట్లాడాలి, దాని గురించి పెద్దలు చెపుతూఉంటే వినాలి, దానికోసం జీవించటానికి ప్రయత్నంచేయాలి. అలా సత్యం పట్ల గౌరవంతో దానికోసం జీవిస్తూ ఉంటే సత్యవస్తువు నీకుతెలుస్తుంది. ఏవస్తువును అందుకోవాలని నీవు అనుకుంటున్నావో... దానిపట్ల పరిపూర్ణమయిన విశ్వాసం, సజీవమైన విశ్వాసం ఉంటే గాని ఆవస్తువు ఎరుకలోనికి రాదు. మనం ప్రపంచాన్ని మోసం చేయగలము గాని లోపలఉన్న భగవంతుని మనం మోసం చేయలేము. మనకు ఆయనపట్ల గౌరవం,ప్రేమ ఉన్నాయా లేదా, మనం ఆయనకోసం జీవిస్తున్నామా లేక గొప్పలకోసం జీవిస్తున్నామా అని భగవంతుడు చూస్తూ ఉంటాడు. మనం ఆయనకోసం జీవిస్తే ఆయన ఎరుకపడతాడు. భగవంతుడు ఎక్కడో ఉన్నాడు అని అనుకోవద్దు. మన హృదయంలోనే ఉన్నాడు, ఉండి మన దేహప్రారబ్ధంననుసరించి మనలను ఆడిస్తున్నాడు. మీరు అలాగ ఉండవద్దు ఇలాగ ఉండవద్దు ఊరక ఉండండి అని చెపుతారు అంటే ఏ హృదయంలో అయితే భగవంతుడు ఉన్నాడో అక్కడకు వెళ్ళి ఉండండి అని చెప్పటం. భయం, కోపం, కోరిక ఇవి అన్నీ తగ్గించుకో అని చెపుతూ ఉంటారు. కోరిక , కోపం, భయం ఇవి అన్నీ వేరుగా మనకు కనిపిస్తున్నాయి. కోరిక ఉన్నవాడికే భయం వస్తుంది, కోరిక ఉన్నవాడికే కోపం వస్తుంది. నీలోపల ఉన్న కోరికే భయంగా, కోపంగా వ్యక్తమవుతుంది. ఈ భయానికి, కోపానికి, చిరాకుకు ఏదైతే కారణమో దానిని నెమ్మదిగా తగ్గించుకొంటూ వెళితే ఏహృదయంలో అయితే భగవంతుడు ఉన్నాడో అక్కడకు నీ మనస్సుజారిపోతుంది.

తలంపులు వస్తూ ఉంటాయి, వెలుతూ ఉంటాయి. ఈ తలంపులు అన్నింటికి ఆధారమైనది నేను అనే మొదటితలంపు. నేను అనే మొదటితలంపు దాని మూలంలోనికి ఉపసంహరించబడుతూ ఉంటే దానికి వచ్చే ఇతర తలంపులు అన్నీ కూడా జారిపోతాయి. ఈ మొదటితలంపు దాని మూలంలోనికి వెళ్ళి అక్కడ ఉన్న భగవంతుడిలో ఐక్యమవుతుంది. అది నీ కడసారిజన్మ. అక్కడకు వెళ్ళాలికదా. లోతుకు దిగు, లోతుకు దిగు అని వేదాలలో చెపుతారు. లోతుకు దిగటం అంటే ఏమిటి? నీలో విషయ వాసనలు ఉన్నాయి కాబట్టి వాటిని తప్పించుకొని లోపలకు వెళ్ళమని చెప్పటం. నీలో విషయవాసనలు లేవుఅనుకో లోతుకు దిగు అన్న మాటకు అర్థంలేదు. నీవు పూర్ణఆరోగ్యంగా ఉంటే రోగం తగ్గించుకో అని చెప్పటంలో అర్థంలేదు అదే

విధంగా నీవు సహజస్థితిలోఉంటే లోతుకు దిగు, లోపలకు చూడు అని ఈ మాటలు చెప్పవలసిన పనిలేదు, నీలో ప్రకృతివాసనలుఉన్నయి కాబట్టి ఆ చెడ్డ నీలో ఉంది కాబట్టి తొలగించుకోమని చెపుతున్నారు. ఆ చెడ్డ నీలో లేకపోతే లోపలకు దిగు అన్నమాటకు అర్థంలేదు. మనం ఏ మార్గంలో ప్రయాణం చేసినా హృదయం అనే గూటిలోనికి చేరుకోవలసిందే, పక్షి ఎక్కడకు తిరిగి వచ్చినా దాని గూటిలోనికి చేరితేనే శాంతి అలాగే మనంఎన్ని జన్మలు ఎత్తి ఎక్కడకు తిరిగి వచ్చినా మనం ఎవరిగా ఉన్నామో, ఏ గుహలో ఉన్నామో అక్కడకు చేరితేనే మనకు శాంతి కలుగుతుంది. మాకు శాంతి లేదు అని కొంతమంది చెపుతూ ఉంటారు. మీకు శాంతి ఎలా ఉంటుంది? సుఖం ఎక్కడ ఉందో, శాంతి ఎక్కడ ఉందో ఆ వస్తువు మీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు కదా మీకు శాంతి అందేది. అది అనుభవంలోనికి రానప్పడు నీవు కోటిజన్మలు ఎత్తినా నీకు శాంతి దొరకదు. ఇక్కడ సుఖం ఉంది, శాంతి ఉంది అని నీవు బాహ్యంగా అనుకోవచ్చు. నీవు అనుకొంటూ ఉంటే ఎవరూ అడ్డురారు. కాని పరిణామంలో ఈ సుఖమే, ఈ భోగమే దుఃఖంగా మారుతుంది. కాని నీవు భగవంతుని నామాన్ని ఆశ్రయిస్తే, భక్తితో నామం చేస్తూఉంటే నీకు ఎంతదుఃఖం ఉన్నా, ఎంతకష్టం ఉన్నా అది అంతా సుఖంగా, శాంతిగా మారిపోతుంది.

భగవంతుని నామాన్ని రూపాన్ని పట్టుకొని చింతించగా చింతించగా అక్కరలేని తలంపులు రావు. నామమే బ్రహ్మము. భగవంతుని నామాన్ని ఎవరు చేస్తున్నారు? నీ శరీరం చేయటంలేదు, నీ మనస్సు నామం చేస్తోంది. నామం చేయగా చేయగా ఏ మనస్సు అయితే నామాన్ని జపిస్తోందో అది వెళ్ళి తన మూలంలో అణిగిపోతుంది. నేను ఎవడను? అనే ప్రశ్న ఎక్కడకు తీసుకొని వెళుతుందో జపం కూడా త్రికరణ శుద్ధిగా చేస్తే అక్కడికే తీసుకొని వెళుతుంది. అది వేరు, ఇది వేరు అనుకోవద్దు. మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా నేను అనే మొదటి తలంపును పోగొట్టుకోవాలి. ఇతరుల కోసం మనం కృషి చేస్తూ ఉంటే దాని ఫలం భగవంతుడు మనకు ఇస్తాడు. కొంతమంది మహాత్ములు ఇతరుల కోసం జన్మిస్తారు, ఇతరుల కోసం పనిచేస్తారు, ఆలోచిస్తారు, జీవిస్తారు దానితో పాటు వారు కూడా మహోన్నతస్థితిని పొందుతారు. నేను ప్రజలకు చేసిన సేవ అంతా నా మనస్సును పవిత్రం చేసింది. ఎంత పవిత్రం చేసింది అంటే ప్రకృతి గుణాలు నా మనస్సును వదిలి వెళ్ళిపోయాయి అని తిలక్ చెప్పారు. ఇతరుల కోసం తిలక్ గారు కష్టపడుతున్నారు అని లోకం అనుకోవచ్చు. కాని దానివలన నా మనస్సు పవిత్రం అయ్యింది. పవిత్రం అవ్వటం వలన మనస్సులోపల ఉన్న వస్తువును అందుకొంటుంది. ఇతరులకు మనం ఏదిచేస్తే అదే మనకు ఎదురు వస్తుంది. మనం చేసినదే మనకు తిరిగి

వస్తుంది.

ఒకే నామాన్ని నీ మనస్సు నిరంతరం జపిస్తూ ఉంటే దాని పట్ల నీకు గౌరవం, ప్రేమ ఉంటే రాగద్వేషములు తగ్గిపోతాయి, నీకు సమానబుద్ధి కలుగుతుంది. ఆ నామమేనీహృదయం లో ఉన్న వస్తువును ఎరుకలోనికి తీసుకొని వస్తుంది. నీవు పవిత్రంగా నామంచేస్తూ ఉంటే నామం అంతదూరం తీసుకొని పోతుంది, నీకు ఇంక ఏమి కావాలి. నీకు నామబుద్ధి,రూపబుద్ధి ఉంది కాబట్టి భగవంతుని నామాన్ని , రూపాన్ని ఆరాధిస్తే నీ రూపంలో నుండి, నామంలో నుండి బయటకు వస్తావు. ఎప్పుడైతే నీ రూపంలోనుండి, నామంలోనుండి బయటకు వచ్చావో నీవు ఏ రూపాన్ని , ఏ నామాన్ని ఆరాధిస్తున్నావో అవి కూడా నిన్ను విడిచిపెట్టేస్తాయి. అప్పుడు మనస్సు తన స్వస్థానంలోనికి వెళుతుంది. నీకు జన్మ వచ్చింది. ఈ జన్మయొక్క లక్ష్యం ఏమిటి, ఈ జన్మ వచ్చినందుకు దేనిని పొందాలి? నామం అంటే సామాన్యం అనుకోవద్దు. నీవు దేనిని పొందాలో నామం చేయటం వలన దానిని పొందుతావు, నామం సహజంగా జరుగుతూ ఉండాలి. అప్పుడు నీకు తెలియకుండా నీ మనస్సు హృదయగుహలోనికి జారిపోతుంది, బ్రహ్మమే రామనామంగా, కృష్ణనామంగా, శివనామంగా వ్యక్తమవుతోంది. బ్రహ్మం వేరు, నామంవేరు అని అనుకోవద్దు. నామం వ్యక్తమవుతున్న బ్రహ్మం. బ్రహ్మం మీకు వ్యక్తం కాకపోవచ్చు, మీ ఇంద్రియాలకు, మనస్సుకు అందకపోవచ్చు, వ్యక్తం కాని బ్రహ్మం నామంలో వ్యక్తమవుతోంది. మీరు సందేహపడవద్దు. సందేహపడితే నశిస్తారు. సందేహపడకుండా విశ్వాసంతో పనిచేస్తే తరిస్తారు. లోపల ఉన్న జ్ఞానగంగ మనకు దొరకాలి. అది దొరకాలంటే ఏదో రేవులో దిగాలి. కృష్ణనామం, రామనామం ఇలా ఏదో రేవులో దిగి జ్ఞానగంగను అందుకోండి, తరించండి, శాశ్వతమైన ఆనందాన్ని, శాంతిని మీ సొంతం చేసుకోండి.

నామం యొక్క విలువ వివేకవంతులకు, ఆత్మజ్ఞానం కలిగిన వారికి తెలుస్తుంది. మలదోషం, విక్షేపదోషం ఎక్కువగా ఉన్నవారికి నామం విలువతెలియదు. రజోగుణం ఉన్నవారికి అసలే తెలియదు. రజోగుణం ఉన్నవారి మనస్తత్వం ఎలా ఉంటుందిఅంటే వారు చెప్పింది మనం వినాలి, మనం చెప్పిన దాని గురించి వారు అసలు ఆలోచించరు, జననమరణ చక్రంలోనుండి వారిని ఎవరూ బయటకు తీసుకొని రాలేరు. రజోగుణం యొక్క విజృంభణను తగ్గించుకొంటే నీవు నామాన్ని ఆశ్రయించగలవు. పరమేశ్వరుని పట్ల భక్తి ఉంటే కదా ఆయన నీకుతెలిసేది. ఈశ్వరుని పట్ల భక్తి కలిగి ఉండి, ఆయన పాదాలను ఆశ్రయిస్తే ఈ నామమే అసలైన నేను, హృదయంలో ఉన్న వస్తువే ఈ నామము దానికి దీనికి బేధం లేదు అని ఈశ్వరానుగ్రహం

వలన నీకుతెలుస్తుంది గాని కేవలం నీ తెలివితేటల వలన గాని ఉదయం ఏదో ఒక గంట నీవు చేసే పూజలు, జపాల వలన గాని తెలియదు.

నీవు ఎంతో కొంత ప్రయత్నంతో నామాన్ని చెయ్యి, సోమరితనంగా ఉండవద్దు, బలహీనులలకు, బద్ధకస్తులకు ఆత్మజ్ఞానం కలుగదు. మొదట మీరు ప్రయత్నంతో ఇష్టమైన భగవంతుని నామాన్ని స్మరించండి. అలా నామాన్ని చేయగా చేయగా కొంతకాలానికి నీవునిద్రలో ఉన్నా, జాగ్రదావస్థలో ఉన్నా ఏ అవస్థలో ఉన్నా లోపల నామం జరుగుతూ ఉంటుంది. ఒకవేళ నీవు మరణ బాధపడుతున్నప్పటికి, మరణించే టైములో నీవుకోమాలోనికి వెళ్ళినప్పటికినీకు తెలియకుండా నీ హృదయం నారాయణ, నారాయణ అని నామం చేస్తూ ఉంటుంది. బయటవారు అనుకొంటారు వీడికి ఏమీ తెలియటంలేదు కోమాలో ఉన్నాడు అనుకొంటారు. కాని లోపల నామం అలవాటు అయితే నీ హృదయం నామం చేస్తూ ఉంటుంది. అప్పడు మరణం నిన్ను ఏమి చేస్తుంది. కోమాలో ఉన్నప్పటికి నీ ప్రయత్నంతో సంబంధం లేకుండా సహజంగా నారాయణ,. నారాయణ అని హృదయంలో స్పందిస్తూ ఉంటుంది. నామం సహజమైపోతుంది. అప్పుడు ఉన్నవస్తువు నీకు వ్యక్తమవుతుంది. అది నీ కడసారిజన్మ. వీడు కోమాలో ఉన్నాడు అని లోకం అనుకోవచ్చు. నీకు మోక్షం ఇచ్చేది లోకం కాదు. నీ హృదయంలో ఉన్న నారాయణుడు . గౌతమబుద్ధుడు, రమణ మహర్షి, ఆచార్యుల వారు దేహం ఉండగానే లోపల ఉన్న వస్తువును అనుభవంలోనికి తెచ్చుకొన్నారు. వారు జీవన్ముక్తులు. ఎప్పడు, ఎక్కడ, ఎలా, మరణం వస్తుందో మనం చెప్పలేము. అది ఈశ్వరాజ్ఞ. నీకు ఆరోగ్యం ఉండగానే ఇప్పడే నామాన్ని అభ్యాసం చెయ్యి. మనం అభ్యాసం చేయగా చేయగా చివరిశ్వాసలో నారాయణ నారాయణ అని హృదయంలో ఉన్నవస్తువే నీ సహస్రారంలో స్ఫురిస్తుంది. నీ రాబోయే జన్మలను క్యాన్సిల్ చేసి తన స్వరూపాన్ని నీకు ఇస్తుంది. అదే విదేహముక్తి. జీవన్ముక్తులు అయినా ఫరవాలేదు, విదేహముక్తులు అయినా ఫరవాలేదు. ముక్తి పొందటం అనేది ఎప్పడో ఒకప్పడు పొందాలి. ఎప్పడో ఎక్కడోపొందుదామనేది ఇప్పడే ఇక్కడే పొందండి అని చెపుతున్నారు. ఈ రోజు చేయలేని సాధన రేపు చేయలేవు. రేపు రేపు అని వాయిదాలు వేసుకోవద్దు. ఈ రోజునుండే సాధన ప్రారంభించండి. ఇప్పటి నుండి ప్రారంభిస్తే, ఆరోగ్యం ఉండగానే ప్రారంభిస్తే ఒకవేళ నీకు అనారోగ్యం వచ్చి మంచం మీదపడి ఉన్నప్పటికి ఒక్కసారి నీ హృదయంలో ఉన్న నారాయణుడు సహస్రారంలో స్ఫురిస్తాడు, నీకు మోక్షాన్ని ఇస్తాడు.

నామం చేస్తుంటే ప్రారంభంలో మీకు అంత తియ్యగా ఉండకపోవచ్చు. చిరాకు, పరాకు

రావచ్చు. ఇతరులు నామం చేస్తుంటే వారి మీద కోపం రావచ్చు. నీవు అశాంతిగా ప్రారంభించవచ్చు కాని నీవు నామం చేయగా చేయగా కొంతకాలానికి శాంతంగా చేయగలిగే శక్తి వస్తుంది. ఇప్పుడు నామం మీ మనస్సు చేస్తోంది. నామం చేసిచేసి మీ మనస్సు ఎప్పుడైతే హృదయంలో అణిగి పోయిందో అప్పుడు మీ హృదయం నామం చేస్తుంది. అప్పుడు మీ ప్రయత్నంతోటి,, మీ తెలివితోటి సంబంధం లేకుండా సహజంగా నామం జరిగిపోతూ ఉంటుంది. ఎంతవరకు నామం చేయాలి అంటే మీ ప్రయత్నంతో సంబంధం లేకుండా సహజంగా మీ హృదయం నామం చేసే స్థితి వచ్చేవరకు మీరు ప్రయత్న పూర్వకంగా నామం చేస్తూ ఉండవలసిందే. మీరు పనులు చేసేటప్పుడు కూడా నామం చేయవచ్చు. నామం ఆపుచేయనక్కరలేదు. బియ్యంలో బెడ్డలు ఏరుతున్నారు అనుకోండి. బెడ్డలు ఏరేటప్పుడు కూడా నారాయణ స్మరణ చేస్తూ ఉంటే ఒక్క ప్రక్క బియ్యంలో బెడ్డలు ఏరటం అయిపోతుంది, రెండో ప్రక్క నారాయణ స్మరణ వలన పుణ్యం పొందవచ్చు. పనికి స్మరణకు విరోధం లేదు.

ఉన్నదేదో ఉంది. లేనిదేదో లేదు. కాని ఉన్నది నీకు వ్యక్తం కావటం లేదు. ఎందుకు వ్యక్తం కావటం లేదు. లేని దానిని ఉంది, ఉంది అని అనుకోవటం కొన్ని వేల జన్మల నుండి అలవాటు పడ్డావు. లేని దానిని ఉంది అనుకొనే వేగం వలన నీ ఇంద్రియాల కంటే, నా మనస్సు కంటే అత్యంత సమీపంలో వస్తువు ఉన్నప్పటికి అది నీకువ్యక్తంకావటంలేదు. అది లేకపోవటం వలన కాదు లేని దానిని ఉంది అనుకోవటం వలన ఉన్నది నీకు తెలియటంలేదు. జ్ఞాని ప్రపంచాన్ని చూస్తాడు, మనం ప్రపంచాన్ని చూస్తాము. మనకు ప్రపంచం మీద భేదబుద్ధి ఉంది. జ్ఞానికి కళ్ళకు కనిపించే ప్రపంచం హృదయంలో అణిగిపోతుంది. నేను వేరు, ప్రపంచం వేరు అనే బేదబుద్ధి వాడికి ఉండదు. లోకం కూడా తాను గానే కనిపిస్తుంది.

బ్రహ్మపదార్థం గురించిఎవరైనా చెపితే వినండి బ్రహ్మపదార్థం గురించి మాట్లాడండి, చదివితే దానిగురించే చదవండి, వింటే దాని గురించేవినండి, ప్రపంచాన్ని ప్రపంచంగా చూడకండి, బ్రహ్మం గానే చూడండి. ఆ బ్రహ్మంగురించే శ్రవణం చేయండి, మననం చేయండి, దానినే చూడండి, దానికోసమే జీవించండి. అది నీకు తెలియకుండా ఎక్కడికి పోతుంది. తప్పనిసరిగా ఈ జన్మలోనే తెలియబడుతుంది. అంటే మీరందరు జీవన్ముక్తులవుతారు అని చెప్పకుండా చెప్పటం.

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-9-99, పాలకొల్లు)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ప్రాణంతో తిరిగే ప్రతీశరీరం మరణిస్తుంది. అలాగే మనశరీరాలు అన్నీ మరణిస్తాయి. పుట్టుక చావుతో అంతమవుతుంది. ఈ శరీరాన్ని దహనం చేస్తారు. అక్కడితో శరీర యాత్ర ముగుస్తుంది. ఈ శరీరం నాది అనేవాడు జీవుడు లోపల ఉన్నాడు కదా. శరీరాన్ని విడిచిపెట్టాక జీవుడు ప్రయాణం చేస్తాడు. మనం హైదరాబాద్ ఫలానా ట్రైనులో వస్తున్నాము అని లెటరువ్రాస్తే మన బంధువులు, స్నేహితులు స్టేషన్‌కు వచ్చి రిసీవ్ చేసుకొంటారు. మరి శరీరాన్ని విడిచిపెట్టాక ప్రయాణం చేసే జీవుడిని ఎవరు రిసీవ్ చేసుకొంటారు? మమ్మల్ని రిసీవ్ చేసుకోండి అని చెపితే రిసీవ్ చేసుకొనేవారు ఎవరైనా ఉన్నారా? లేరు అని అనుకోవద్దు ఉన్నారు ఎవరు అంటే ఈ శరీరం భూమిమీద ఉండగా మనం చేసిన మంచిపనులు, మాట్లాడిన మంచి మాటలు శరీరం మరణించాక జీవుడిని రిసీవ్ చేసుకొని చీకటిమార్గంలో కాకుండా వెలుగు మార్గంలో మంచిలోకాలకు తీసుకొని వెళతాయి. ఆ మంచిపనుల యొక్క ఫలితం ఉన్నంతకాలం అక్కడఉంటాము. మనం చేసిన మంచి పనులు, మాట్లాడిన మంచి మాటలు, మన మెదడులోనికి వచ్చే మంచిఆలోచనలు వృధాపోతాయి అనుకోవద్దు. ఈ శరీరం మరణించాక జీవుడిని అవిదగ్గర ఉండి తీసుకొని వెళతాయి. మనం మరణం అంటే కంగారు పడతాము కాని మనం మంచిపనులు చేసిఉంటే కంగారుపడనక్కరలేదు. ఎందుచేతనంటే అవే మన జీవుడికి దగ్గర ఉండి దారి చూపిస్తాయి. మరణం యొక్క వాస్తవ రూపం తెలిసే కొలది మరణం అంటే భయం పోతుంది.

మనందరము గుడికి వెళుతున్నాము. గుడిలో ఉన్న దేవుని చూస్తున్నాము. గుడిలో ఉన్న దేవుడిని చూడటం మంచిదే. గుడిలో ఉన్నదేవుడిని చూడటం వలన మరణించటం పుట్టటం ఈ రాకలుపోకలు ఇవి అన్నీ ఆగిపోవు. ఈ ప్రయాణాలు ఎప్పడు ఆగిపోతాయి అంటే, నీ కడసారి జన్మ ఎప్పడు అంటే నీ హృదయంలో ఉన్న దేవుడిని చూడాలి. గుడికి వెళతారు, దేవుని చూస్తారు. మాకు శాంతి లేదు, సుఖం లేదు అంటారు. గుడిలో ఉన్న దేవుని చూడటం వలన మీకు శాంతి కలుగదు. హృదయంలో ఉన్న దేవుడిని చూస్తే మనకు పరిమితులు లేని సుఖం, శాంతి కలుగుతుంది. అప్పడు స్వర్గానికి వెళ్ళాలి, ఈ లోకానికి వెళ్ళాలి, ఆలోకానికి వెళ్ళాలి అనే సంకల్పమే ఉండదు.

మనలను ఎవరైన పొగిడితే పొంగిపోతాము, ఎవరైనా విమర్శిస్తే కృంగిపోతాము. అదీ తట్టుకోలేము, ఇదీ తట్టుకోలేము. సుఖం వచ్చినా తట్టుకోలేము. దుఃఖం వచ్చినా తట్టుకోలేము.

తిలక్ గారు చాలా సమానంగా ఉండేవారట. ఆయన గురించి ఒక సంఘటన చెపుతారు. తిలక్ గారు ఒకరోజు టీ త్రాగుతూ పేపరు చదువుతున్నారట. వారి మనవలు బిస్కట్లు తింటూ టీ త్రాగుతున్నారట. మీరు ఏమి చేస్తున్నారు అని తిలక్ గారు మనవలను అడిగారట. మేము బిస్కట్లు తింటూ టీ త్రాగుతున్నాము అని చెప్పారట. మరి నేనేమి తింటున్నాను అని అడిగారట. మీరు ఏమీ తినటం లేదు టీ త్రాగుతున్నారు అన్నారట. అప్పుడు తిలక్ గారు చెప్పారట ఈ పేపరు అంతా నన్ను తిడుతూ వ్రాసారు. మీరు బిస్కట్లు తింటూ టీ త్రాగుతున్నారు నేను తిట్లు తింటూ టీ త్రాగుతున్నాను. అదే తేడా మీరు బిస్కట్లు తింటున్నారు, నేను తిట్లు తింటున్నాను అని చెప్పారట, ఇది ఎందుకు చెపుతున్నాము అంటే అప్పుడుకూడా ఆయన మొఖంలో వికారం కనబడలేదు. ఆ స్థాయిని కనుక మనం సంపాదిస్తే ఇంక రాకపోక ఉండదు. ఈ శరీరం పడిపోయినప్పుడే మోక్షస్థితిని అందుకొంటాము. అప్పుడు వాడికి శరీరం ఉన్నా, శరీరం లేకపోయినా ఒక్కటే. ఈ లోకం కనిపించిన కనిపించకపోయినా ఒక్కటే, నేను ఉన్నాను అన్న సంగతి వాడికి తెలుస్తూ ఉంటుంది, ఉండటం అనేది వాడికి అనుభవం అవుతూ ఉంటుంది. లోపలఉన్న శాంతి, సుఖం వాడికి ఎంత అనుభవంలోనికి వస్తుంది అంటే వాడి మనస్సు చెదరమంటే చెదరదు, ఇంద్రియాలు కదలమంటే కదలవు. అటువంటి ఉన్నతమైన ఉదాత్తమైన స్థితిని ఆ జీవుడు అందుకొంటాడు. ఆ స్థితిని అందుకొనే వరకూ మనకు జన్మించటం, మరణించటం జరిగిపోతూ ఉంటాయి. మనం చేసే పూజలు, జపాలు, ధ్యానాలు ఆ స్థితిని పొందటం కోసమే.

మనకు, లోకానికి ఆధారంగా ఏ వస్తువు అయితే ఉందో అదే చైతన్యం, వాడే నారాయణుడు. మనం లోకాన్ని చూస్తున్నాము గాని లోకానికి ఆధారంగా ఉన్న వస్తువును చూడటం లేదు. దానికి మోహమే కారణం. ఈ లోకాన్ని ఎంజాయ్ చేయాలనే భోగబుద్ధి ఉన్నంతకాలం మనకు ఆత్మబుద్ధి కలుగదు. కొంతమంది 100 సంవత్సరాలు వచ్చినా లోకాన్ని మామిడిటెంకను నాకినట్లు నాకుతూ ఉంటారు. 100 సంవత్సరాలు జీవించాము ఇప్పటికైనా మనస్సును లోపలకు తోలుకొని వెళదాము అనేటువంటి వైరాగ్యం, అభ్యాసం ఉండదు. మనం ఏ గురువును ఆశ్రయించినా, ఏ సాంప్రదాయంలో ప్రయాణించినా ప్రకృతిగుణాలు దాటకుండా మనకు ఆత్మజ్ఞానం కలుగదు. అంతవరకు మనకు ఏజన్మకు ఆజన్మ శవబుద్ధి ఉంటుంది కాని శివబుద్ధి కలుగదు. మాటకంటే మౌనం గొప్పది. మౌనం యొక్క శక్తి హృదయం యొక్క లోయలలోనికి నిన్ను గెంటుకొనిపోతుంది. మహాత్ముల యొక్క మౌనం వలన వారు చూడటం వలన, వారి గాలి సోకటం వలన మన హృదయంలో ఉన్న వస్తువు మన సహస్రారంలో ఒక్కసారి తళుక్కున

మెరియవచ్చు. అది కలగటానికి వారి వైబ్రేషన్స్ కారణం. ఆ స్థితి మనకు కలగాలంటే వారి అనుగ్రహానికి పాత్రులు అవ్వాలంటే శాస్త్రాన్ని అధ్యయనం చేయాలి, పెద్దలను సేవించాలి, మనం చేయగలగిన మంచిపనులు చేయాలి, ఎంతో కొంత సాధన చేయాలి. ఎదుటి వారి సుఖం కోసం శాంతికోసం, ఆనందంకోసం మనం పనిచేస్తూ ఉంటే సుఖం, ఆనందం, శాంతి మనం కోరకుండానే మనకు వస్తాయి. నీ హృదయంలో ఉన్న వస్తువు ఏ విద్యవలన నీకు తెలుస్తుందో అదే నిజమైనవిద్య, అదే ఆత్మవిద్య, అదే రాజవిద్య. ఆత్మవిద్య తప్పించి మిగిలిన విద్యలు అన్నీ దొమ్మరవిద్యలు, వేశ్యవిద్యలు అన్నాడు యోగి వేమన. ఆ పని చేస్తే ఆ పుణ్యం వస్తుంది, ఈ పూజ చేస్తే స్వర్గానికి వెళతావు అని చెప్పే విద్యలు అన్నీ వేశ్యవిద్యలే.

భౌతిక దృష్టితో మన క్షేమం కోరి ఎవరైన పనిచేస్తూ ఉంటే వారినే మనం మర్చిపోతున్నాము. మనం గుణవంతులము ఎలా అవుతాము. మనం గుణవంతులము కాదు అని అర్థమవుతోంది కదా, లోకానికి సంబంధించిన మంచినే మర్చిపోయేటప్పడు లోపలఉన్న ఉత్తమవస్తువు, ఉదాత్తమైనవస్తువు, మరణంలేని వస్తువు నీకు ఎలా అందుతుంది. నీవు గుణవంతుడివి అయితే కదా అది నీకు అందేది. నీవు గుణవంతుడివి కానప్పడు, నీ బుద్ధిని సమానంగా ఉంచుకొనే శక్తి నీకు లేనప్పడు లోపలఉన్న వస్తువు నీకు ఎలా అందుతుంది. కొంతమందికి స్నేహం ఉంటుంది. ఇప్పడు మొదలుపెడితే వారం తిరిగేటప్పటికి ఆ స్నేహం ఊడిపోతుంది. అలా కాదు. కలకాలం ఆ స్నేహం ఉంది అంటే ప్రాణం పోయేవరకు ఆ స్నేహం నిలబడింది అంటే పూర్వజన్మలో అనుబంధం ఉండి ఉండాలి. అనుబంధం లేకపోతే ఆ స్నేహం చిరకాలం, కలకాలం నిలబడదు. నీ మీద నాకు ప్రేమ ఉన్నా, నామీద నీకు ప్రేమ ఉన్నా అది జన్మాంతర అనుబంధం. జన్మాంతరంలో అనుబంధం ఉంటే ఒకరి పొరపాటును మరొకరు మన్నించుకొంటారు. జన్మాంతరంలో అనుబందం లేకపోతే ఒకరిపొరపాటును ఒకరు పెద్దది చేసుకొని వీధిలో పడతారు. జన్మాంతర అనుబంధం ఉంటే కదా స్నేహం స్మశానానికి వెళ్ళేవరకు నిలబడేది అని కాళిదాసు చెప్పాడు. రమణమహర్షి గారికి నాకు ఉన్న అనుబంధం ఏమిటి అంటే ఆయన పుస్తకాలు నేను చదువలేదు, ఆయన గురించి ఎవరైనా చెపుతూ ఉంటే నేను వినలేదు. ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలనే కాంక్షలేదు, ఆయన ఎవరో నాకు తెలియదు. ఆయన ఎవరో నాకు తెలియకుండానే జన్మాంతర అనుబంధాన్ని బట్టి ఎంతో కొంత ఆధ్యాత్మిక అభివృద్ధిని ప్రసాదించాడు. అది పూర్వజన్మ అనుబంధం. రమణమహర్షి గారితో నాకు ఉన్న అనుబంధం జన్మాంతర అనుబంధం. అది నేను మనస్సుతో ఆలోచించుకొని, బుద్ధితో నిర్ణయించుకొన్నది కాదు. ఒకవేళ మీరందరు రమణమహర్షిని తిట్టినా నాకు రవ్వంత, ముల్లంత

ఆయన మీద ఇష్టంపోదు. ఎందుచేతనంటే అది మనస్సుతోను, బుద్ధితోను నిర్ణయించుకొన్నది కాదు. నీకు ఆత్మజ్ఞానం కలగటం కోసం అందరి దేవతల అనుగ్రహం అక్కరలేదు, అందరి యోగుల అనుగ్రహం అక్కరలేదు. ఆత్మజ్ఞానం కలగటం కోసం అందరి అనుగ్రహం పనేలేదు. ఏదో ఒక యోగి యొక్క, గురువు యొక్క అనుగ్రహం చాలు.

కొంతమంది దేనిని చూస్తే దానికి ఆకర్షించబడతారు. ఏ పరిసరాలలో ఉన్నారో ఆ పరిసరాల ప్రభావం అంతా వారి బ్రెయిన్ మీదపడుతూ ఉంటుంది. పరిసరాల ప్రభావానికి లోనుఅయ్యే మనుషులకు మాత్రం ఈశ్వరానుగ్రహం ఎలా ఉంటుందో అర్థంకాదు. పరిసరాల ప్రభావానికి లోను కాకుండా ఎప్పటికప్పుడు వారి బ్రెయిన్‌ను సమానంగా ఉంచుకొన్నవాడికి మాత్రమే అనుగ్రహం గుర్తులు తెలుస్తూ ఉంటాయి. చాడ్విక్ భగవాన్ ఉన్నప్పుడు ఆయనతో ఆశ్రమంలో ఉన్నారు. భగవాన్ శరీరం విడిచిపెట్టిన తరువాత సడన్‌గా ఆయనకు వారి దేశం గుర్తుకు వచ్చింది. భగవాన్ శరీరం విడిచిపెట్టిన తరువాత ఇక్కడ మనకు పని ఏముంది? మనం ఎవరికోసమైతే వచ్చామో వారి దేహం ఇక్కడలేదు. ఇంక ఈ దేశంతో మనకు పనిలేదు అనుకున్నాడు. ఇంగ్లండ్ వెళ్ళటానికి టికెట్ కొనుక్కున్నాడు. అన్నీ సర్దుకొని విమానం ఎక్కటానికి అరుణాచలం నుండి బయలుదేరి బొంబాయి వెళ్ళాడు. ఇండియా విడిచిపెట్టి ఇంగ్లండ్ వెళ్ళటానికి విమానం ఎక్కటం కోసం సిద్ధంగా ఉన్నాడు. మనం ఎక్కడికి వెళ్ళపోతున్నాము. మన భగవాన్‌ను విడిచిపెట్టి వెళ్ళిపోతున్నాము, డివైన్ ప్రెజెన్స్‌ను విడిచిపెట్టి వెళ్ళిపోతున్నాము అని ఏదో సడన్‌గా జన్మాంతర స్మృతి వచ్చింది. టికెట్ కేన్సిల్ చేసుకొన్నాడు వెంటనే తిరిగి అరుణాచలం తిరిగి వచ్చేసాడు. అది జన్మాంతర అనుబంధం. ఏ శక్తి అతనిని ఆపుచేసింది. ఏశక్తి అయితే అతనిని ఇంగ్లండ్ నుండి అరుణాచలం తీసుకొని వచ్చిందో ఆ శక్తే ఇప్పుడు అరుణాచలం నుండి ఇంగ్లండ్ వెళ్ళకుండా ఆపుచేసింది. జన్మాంతర అనుబంధం అంటే అలా ఉంటుంది అని చెప్పటానికి చెపుతున్నాను. గురువు శరీరం పడిపోయిన తరువాత కూడా గురువుతో అనుబంధం మనకు తెగదు. తెంపుకొందామన్నా అది తెగదు. గురువు అంటే శరీరం కాదు. గురువు శరీరం ఉన్నా, శరీరం పడిపోయినా గురువు అనుగ్రహం ఎప్పుడూ ఉంటుంది. గురువు అనుగ్రహం వచ్చి ఒక్కసారి నిన్నుతాకినప్పుడు భౌతికమైన బంధాలు అన్నీ తెగిపోతాయి. శరీరం ఉండగానే నేను శరీరమాత్రుడను కాదు అనే బుద్ధి నీకు కలుగుతుంది.

తిలక్ గారికి స్వరాజ్యం అంటే చాలా ఇష్టం. స్వరాజ్యం నా జన్మహక్కు దానిని పొందుతాను అని చెప్పేవారు. ఆయన మరణసమయంలో మీరు ఏమి తీసుకొంటారు, ఏమి కావాలి అని అడిగితే స్వరాజ్యం, స్వరాజ్యం అని చెప్పారట. ఆయన దేశభక్తి చూడండి. తిలక్ స్వరాజ్యం నా

జన్మహక్కు అని చెప్పారు. కాని మనం ఏమి అనాలి అంటే ఆత్మజ్ఞానం సంపాదించటం నా జన్మహక్కు అని చెప్పాలి. ఎంతో కొంత కృషి చేస్తే ఒకరోజు వెనుకోముందో తప్పనిసరిగా అది పొంది తీరుతాము. ప్రతి వాడికి వాడి దేహం అంటే వాడికి ఇష్టం. ప్రతీ వాడికి దేహబుద్ది ఉంటంది, నామబుద్ది ఉంటుంది. లోపల ఉన్న సద్వస్తువు తెలియకుండా వాడి దేహబుద్ధి, నామబుద్ది ఆపుచేస్తుంది. పరమేశ్వరుని చింతించగా, చింతించగా మన దేహబుద్ధి నుండి, నామబుద్ది నుండి విడుదల పొందుతాము. ఎప్పడైతే దేహబుద్దినుండి, నామబుద్ది నుండి విడుదల పొందామో నది వెళ్ళి సముద్రంలో కలిసినట్లు మనం పరబ్రహ్మంలో ఐక్యమవుతాము. అది పరమస్థితి. గాలి వీస్తూ ఉంటే చెట్లు ఆకులు ఎలా కదులుతాయో అలాగ పరిస్థితుల ప్రభావం వలన ప్రతీ సంఘటనకు నీ మనస్సు కదులుతూ ఉంటే నీకు భక్తి ఏమిటి? నీకు జ్ఞానం ఏమిటి? అంటే చాపల్యం ఉన్నప్పడు నీవు ఈశ్వరానుగ్రహానికి అర్హుడవు కాదు అని చెప్పటం, చాపల్యబుద్ది తొలగించుకోవాలి. నీ తెలివితేటలవలన నీవు పవిత్రుడవు కాలేవు. కేవలం నీ తెలివివలన నీ జీవితంలో మార్పురాదు. గురువు యొక్క మౌనం నిన్ను పవిత్రుడిని చేస్తుంది, నీకు ఏకాగ్రత ప్రవీణత కలుగుతుంది.

ఏది నేర్పు? ఏది యోగం? వాడు బుద్దిమంతుడు అని చెప్పటానికి ఏది ప్రమాణం? అని అంటే భగవంతుడు ఏమి చెప్పాడు అంటే నీవు ఏదైనా ఒక మాట మాట్లాడినా, ఏదైనా ఒక పని చేసినా నీ మాటవలన, నీ పనివలన నీ హృదయంలో అంతర్యామిగా ఉన్న భగవంతుడు తెలియబడాలి అదే నేర్పు. అదే యోగం. ఏదో పనిచేశాను అని అంటే కాదు నీవు చేసే పని నీ హృదయంలో అంతర్యామిగా ఉన్నా సర్వేశ్వరుని అందుకోవటానికి సహకరించాలి. అదే యోగం. అదే భగవాన్ ఏమి చెప్పారు అంటే కర్తలేని కర్మ చెయ్యి. నీ ప్రవర్తన వలన, నీవు చేసేపని వలన అంతర్యామిగా ఉన్న భగవంతుడు అనుభవైకవేద్యం కావాలి. అది నేర్పు, అది యుక్తి. నీకు చాపల్యబుద్ది లేదు అనుకో, నీ మనస్సు అణిగింది అనుకో, నీ బుద్ది హృదయాభిముఖంగా ప్రయాణం చేస్తోంది అనుకో పరిసరాలతో సన్నిహితసంబంధం ఏర్పడుతుంది., ఈ సృష్టిని అంతా కౌగిలించుకోవాలి అనిపిస్తుంది. నిప్పను ముట్టుకొంటే చేతులు కాలకుండా ఉండవు. అలాగే ఒక మహాపురుషునితో మానసిక అనుబంధం ఏర్పడితే నీ అజ్ఞానాన్ని ఆపుకుందామన్నా ఆపుకోలేవు, అది కాలిపోతుంది. నీకు నిజంగా సత్యం కావాలంటేనీవు లోపలకు వెళ్ళవలసిందే. అది పొందటం కోసం కొన్ని కష్టసుఖాలు అనుభవించాలి. ఆ లోతులలోనికి దిగటానికి అభ్యాసం, వైరాగ్యం, వివేకం అవసరం. నీకు సహనం ఉంటే నీ దుఃఖం అంతా శాంతిగా మారిపోతుంది. ఒకోసారి జీవితంలో కొన్ని

సంఘటనలు పరిస్థితులు వస్తూఉంటాయి. ఆ పరిస్థితులు బాగాలేదని మీ మనస్సుకు అనిపిస్తుంది. ఆ పరిస్థితులు మిమ్మల్ని ఎక్కడికి తీసుకొని వెళ్ళటానికి, జీవితంలో ఏ మార్పు తీసుకొని రావటానికి భగవంతుడు ఉద్భవించాడో మీకు తెలియదు. మన గురించి మనకంటే బాగా దేవుడికి తెలుసు. అందుచేత మీకు వర్రీ వద్దు, హర్రీ వద్దు. మంచిపనులు చేస్తూ ఉండండి. ఏమీ టైర్ అవ్వకండి. మీ సాధనాబలం పెరుగుతూ ఉంటే మీకు పవిత్రభావాలు, పుణ్యభావాలు కలుగుతూ ఉంటే అవే హృదయం యొక్క లోతులలోనికి తీసుకొని పోతాయి.

గోపికలు అంటే మామూలు వారే అనుకొంటున్నారు, గోపికల ప్రేమ ఒకసారి లోకానికి చూపించాలి అని కృష్ణుడికి అనిపించింది. కృష్ణుడికి ఒకరోజు తలపోటు వచ్చింది. డాక్టర్లు వచ్చి మందులు ఇచ్చారు కాని తలపోటు తగ్గలేదు. కృష్ణుడికి తలపోటు వచ్చింది అని భక్తులు బాధపడుతున్నారు. అప్పుడు కృష్ణుడు చెప్పాడట భక్తుల పాదధూళి తీసి నా మొఖానికి రాస్తే ఈ తలపోటు పోతుంది అని చెప్పాడట. అప్పుడు భక్తులను పిలిచారట. మీరందరు భక్తులేకదా మీ పాదధూళి కృష్ణుడి మొఖానికి వ్రాయండి అని చెప్పారట. అప్పుడు భక్తులు అన్నారు మేము మటుకు వ్రాయము ఎందుచేతనంటే కృష్ణుడు దేవుడు మా పాదధూళి తీసి ఆయన మొఖానికి వ్రాస్తే మాకు నరకం వస్తుంది. ఆయన తలపోటు తగ్గితే తగ్గవచ్చును మేము నరకానికి వెళతాము. మేము చేతులారా నరకానికి వెళ్ళే పనులు చేసుకోము అని చెప్పారు. ఆ విషయం బృందావనం చేరింది. గోపికలు అందరూ కృష్ణుడిని చూడటానికి వచ్చారు. అప్పుడు గోపికలు అందరూ చెప్పారు కృష్ణుడి మొఖానికి మా పాదధూళి వ్రాస్తాము ఆయనకు తలపోటు తగ్గటం ముఖ్యం గాని దానివలన మేము నరకానికి వెళ్ళినా పరవాలేదు. నరకానికి వెళ్ళి యుగాల తరబడి ఉంటాము, మాకు ఏమి అభ్యంతరము లేదు అని చెప్పారట. అది ప్రేమ అంటే. గోపికల పాదధూళి వ్రాస్తే కృష్ణుడికి తలపోటు తగ్గిందట. ఇక్కడ మిగతా భక్తుల ప్రేమ, గోపికల ప్రేమ చూడండి. మిగతా భక్తుల ప్రేమ లెక్కలతో కూడినది. గోపికల దగ్గరకు వచ్చేటప్పటికి లెక్కలు ఏమీ లేవు. అది నిజమైన ప్రేమ. గోపికల ప్రేమను లోకానికి చూపించటానికి కృష్ణుడికి తలపోటు వచ్చింది. లేకపోతే భగవంతుడికి తలపోటు రావడమేమిటి.